ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 18 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం)

సహర్: 5:00 (బుధవారం ఉదయం)



మూగ రోదన

- విలవిలలాడుతున్న వన్యప్రాణులు
- దాహార్తి తీర్చుకోలేక అవస్థలు
- నిలిచిపోయిన అటవీ జంతువుల తాగునీటి నిధులు
- సాసర్ పిట్లలో జీపీ ట్రాక్టర్ల ద్వారా నింపుతున్న నీళ్లు

కృష్ణకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు.. ఇతర జీవులూ ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరి కావడం పరిపాటి. సమయానికి తాగునీరు దొరక్కపోతే అవస్థలు పడక తప్పదు. నిత్యం జనారణ్యంలో సంచరించే జంతువులు, పక్షులకు నీటి కొరత ఉండకపోవచ్చు గానీ.. వన్యప్రాణులకు మాత్రం తిప్పలు తప్పవు. వేసవిలో నీటి వనరులు అడుగంటిపోతే అవి విలవిలలాడుతుంటాయి. ఈ ఏడాది కూడా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో అటవీ జీవులు నీటి కోసం అల్లాడుతున్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 1,69,461.28 హెక్టార్ల అటవీ విస్తీర్ణం విస్తరించి ఉంది. భూపాలపల్లి, మహదేవపూర్ రెండు ఫారెస్టు డివిజన్లు ఉన్నాయి. వీటిల్లో ఎక్కువగా దుప్పులు, నెమళ్లు, కుందేళ్లు, కొండె గొర్రెలు ఇతరత్రా జంతువులు పెరుగుతున్నాయి. వీటి దాహార్తి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇచ్చేవి. ఈ నిధులు గత రెండేళ్ల నుంచి నిలిపివేశారు. దీంతో వేసవిలో వన్యప్రాణులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నాయి. రోడ్ల మీదకు, జనసంచారం ప్రదేశాలకు వస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటితో పాటు రెండు డివిజన్లలో కేవలం రెండే సోలార్ బోర్లు ఉండగా వాటితోనే ఫారెస్ట అధికారులు వెల్లదీస్తున్నారు. మరో నాలుగు సోలార్ బోర్లకు ప్రభుత్వానికి అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది.

ఉచ్చులకు ఎక్కువ ఆస్కారం..

వేసవిలో వన్యప్రాణుల వేట పరిపాటే. ఈ కాలంలోనే వన్యప్రాణాలు దాహార్తిని తీర్చుకొనేందుకు బయటకు వచ్చి వేటగాళ్ల ఉచ్చులో పడుతుంటాయి. అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్ల వద్ద వేటగాళ్లు అధికంగా ఉచ్చులు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల భూపాలపల్లి అటవీ రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్ వద్ద వేటగాళ్లు ఉచ్చుని బిగించిన ఘటనను అటవీశాఖ అధికారులు గుర్తించి తొలగించారు. అలా వేటగాళ్లు అమర్చే ఉచ్చులతో అటు వన్యప్రాణులేకాకుండా పాటు అడవికి వెళ్లే పశువుల కాపర్లు, ఫారెస్టు సిబ్బంది ప్రమాదాల బారిన పడే ఆస్కారం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఉచ్చుల మూలంగా ప్రమాదాలు జరుగకముందే ఫారెస్టు, పోలీసుల శాఖ అధికారులు దృష్టి పెట్టి ఉచ్చులు బిగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- నవీన్‌రెడ్డి, అటవీ శాఖ జిల్లా అధికారి (భూపాలపల్లి)

మూగ జీవాల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అడవి ప్రాంతాల్లో తాగునీటిని కల్పించేందుకు సాసర్ పిట్లను ఏర్పాటు చేశాం. వీటి నిర్వహణకు ప్రత్యేకంగా నిధులేమీ రావడం లేదు. వేటగాళ్లు ఎవరైనా ఉచ్చులు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అటవీ ప్రాంతాల్లో అగ్గి రాజుకోకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలి.



భూపాలపల్లి రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్

నిధులు లేక.. నీళ్లు నింపలేక..

జిల్లా వ్యాప్తంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ అధికారులు 111 సాసర్ పిట్స్‌ను ఏర్పాటు చేశారు. నిధులు లేమి కారణంగా వీటిల్లో నీటిని నింపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న గ్రామ పంచాయతీల ట్రాక్టర్లను నీటిని నింపేందుకు తాత్కాలికంగా వాడుకుంటున్నారు. ఇప్పటికే ఎండలు దంచి కొడుతుండగా రాబోయే ఏప్రిల్, మే నెలల్లో ఇంకా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీల ట్రాక్టర్ల ద్వారా మూడు రోజులకోసారి నీటిని నింపుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్లు సమకూర్చగా సాసర్ పిట్స్ ఖాళీగా దర్శనమిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

చేతికొచ్చిన ఆయిల్‌పామ్ తొలి పంట



రూపిరెడ్డిపల్లిలో కోసిన ఆయిల్‌పామ్ గెలలతో రైతులు

రేగొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగు చేసిన ఆయిల్ పామ్ మొదటి పంట చేతికి వచ్చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ దిగుమతిని తగ్గించి మనదేశంలోనే దీని సాగు కోసం రైతులకు ప్రోత్సహకాలు అందజేస్తుండగా సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మొదటగా ఆరు ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. మూడు సంవత్సరాల ఐదు నెలల అనంతరం మొదటి క్రాప్ వచ్చింది. దీంతో ప్రభుత్వ ఒప్పందం ప్రకారం మొక్కలు అందించిన సువేన్‌ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు చేను వద్దకు వచ్చి కొనుగోలు చేశారు. ఇందుకు టన్నుకు రూ. 20,850 ధరను చెల్లించారని రైతు తెలిపారు. ఆయిల్‌పామ్ తోటలో అక్కడక్కడా కోతకు వచ్చిన గెలలు కోసామని, మిగతావి వచ్చే నెలలో సిద్ధమవుతాయని ఆయన అన్నారు. మిగతా పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ పంట లాభదాయకంగా అనిపిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రయోజనకరం.. లాభదాయక పంట



భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభదాయకం గానూ, ప్రయోజనకరంగానూ ఉంటుందని రైతు పోల్నేని రాజేశ్వర్‌రావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందజేసి ప్రతిష్ఠాత్మకంగా రైతులతో ఆయిల్‌పామ్ పంటను సాగుచేయించారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో మొదటగా ఆయిల్‌పామ్ సాగును పోల్నేని రాజేశ్వర్‌రావు తనకున్న ఐదెకరాల్లో మూడు సంవత్సరాల ఐదునెలల క్రితం ఈ పంట వేశారు. ఇప్పుడు ఆ పంట కోతకు రాగా టన్నుకు రూ.20,850 ధర పలికింది. దీంతో ఒప్పందంలో భాగంగా మొక్కలను అందించిన సువేన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు సోమవారం పంటచేను వద్దకు చేరుకుని కొనుగోలు చేశారు. అత్యధిక ధరకు కొనుగోలు చేయడంతో రైతు ఆనందం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా రైతు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు చేయడం వల్ల అధిక లాభదాయకం ఉంటుందని అన్నారు. కూలీల ఖర్చు లేకుండా ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయడం మంచిదని అన్నారు. తాను సాగుచేసిన పంటకు అధిక ధర పలకడంతో రైతు హర్షం వ్యక్తంచేశారు.

పోలీసులకు చిక్కిన మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్?

- రాజలింగమూర్తి హత్య కేసులో ఎనిమిదో నిందితుడు
- క్రెడిట్‌కార్డు లావాదేవీల ఆధారంగా దొరికిన ఆచూకీ
- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న భూపాలపల్లి పోలీసులు?

వివరాలు 6వ పేజీలో..

ప్రజా వినతులపై సత్వరమే స్పందించాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణమే స్పందిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తునూ పరిశీలించి అర్జిదారులకు సమాధానం ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ప్రజావాణి జిల్లాకు వచ్చిన వినతులను పరిష్కరించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఆ పరిధిలో పరిష్కరమయ్యే సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే ప్రజలు వినతులు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 51 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏవోను కలెక్టరేట్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల అందజేత

దృష్టిలోపంతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. కలెక్టర్ రాహుల్ శర్మ వాటిని పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం సోమవరం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు గత నెలలో నిర్వహించగా 658 మందికి దృష్టిలోపం ఉన్నట్టు నిర్ధారించారని తెలిపారు. మొదటి విడతలో 292 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలిన విద్యార్థులకు త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, విద్యా, పోలీస్, వైద్య, విద్యుత్, పీఆర్, మునిసిపాల్ సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈనెల 21నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలపై సమీక్షించారు. జిల్లాలోని 121 పాఠశాలలకు చెందిన 3,449 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీఈవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఫేక్ వీడియోలు పోస్టు చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు

భూపాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని కించపరిచేలా సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పోస్టు చేస్తున్న వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు, ఎన్నారై రవి పులుసు ట్విట్టర్‌లో ఫేక్ వీడియోలు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కేటీఆర్ అండదండలతో ఈ ఫేక్ వీడియోలు చేస్తున్నట్లు ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో యువజన కాంగ్రెస్ నాయకులు ప్రేమ్, అఖిల్, అజయ్, శ్రీకాంత్, రాజు, తరుణ్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చందు (ఫైల్)

భూపాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చదువుకోమ్మని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మేకల చందు (23) డిగ్రీ చదువు మధ్యలో మానేసి వ్యవసాయ పనులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 11న ఎండలో వ్యవసాయ పనులకు వెళ్లకుండా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని అతడిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన చందు పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. తాను పురుగుల మందు తాగనని కుటుంబ సభ్యులకు సమాచారం చెప్పడంతో వెంటనే అతడిని చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం హనుమకొండలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తుండగా చందు సోమవారం మృతి చెందాడు. తండ్రి కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

కేటీపీపీలో సాంకేతిక లోపం

గణపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మొదటి దశ విద్యుత్ ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. సోమవారం ట్యూబ్ లీకేజీ సమస్య తలెత్తడంతో ప్రాజెక్టును షట్‌డౌన్ చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో ట్యూబ్ లీకేజీలు సమరించి ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభిస్తామని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి దుర్మరణం



మృతి చెందిన రమేష్

వెంకటాపూర్, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లగుంట గ్రామ శివారులోని కృష్ణాలయం సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన చెన్నమశెట్టి రమేష్ (45) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తన కూతురు దగ్గరకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో నల్లగుంట కృష్ణాలయం సమీపంలోని కల్వర్టు దగ్గర ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. దీంతో అతడు కిందపడిపోగా అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్ ములుగులో కంగన్‌హాల్ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడి భార్య విజయ ఇ ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం కేసులో ముగ్గురి బైండోవర్

మహాముత్తారం, మార్చి17(ఆంధ్రజ్యోతి): సుంకం చెల్లించని మద్యం విక్రయం కేసులో ముగ్గురిని తహసీల్దార్ డి.శ్రీనివస్ ఎదుట సోమవారం బైండోవర్ చేశామని కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. కనుకునూర్ గ్రామానికి చెందిన బొచ్చు అనుషా, సింగంపల్లికి చెందిన శ్రీరామ్ ప్రేమ్‌కుమార్‌ను కిరాణం షాపులో మధ్యప్రదేశ్‌కు చెందిన సుంకం చెల్లించని మద్యం అమ్మినందుకు అరెస్టు చేసి బెండోవర్ చేసినట్లు తెలిపారు. వీరివురికి మద్యం సరఫరా చేసిన మహాముత్తారం గ్రామానికి చెందిన మారగొని బాపు(టైలర్), నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సంది సుధాకర్, గాదే సారయ్యను అరెస్టు చేసి బైండోవర్ చేశామన్నారు. ఈ ముగ్గురు నిందితులను విచారించగా మహాముత్తారం గ్రామానికి చెందిన మహబూబ్ పాషా మధ్యప్రదేశ్ నుంచి సుంకం చెల్లించని మద్యాన్ని తమకు సరఫరా చేశారని తెలిపారని ఎస్సై వెల్లడించారు. పాషాపై కూడా కేసు నమోదు చేశామని, ఇంటికి తాళం వేసి అతడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి) : గిరిజన దర్బార్‌లో వినతుల ద్వారా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపించాలని సెక్టోరియల్ అధికారులను ఐటీడీఏ పీవో చిత్రా విశ్రార ఆదేశించారు. మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ సోమారం జరిగింది. గిరిజనుల వద్ద నుంచి పీవో వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 16మంది వినతులు రాగా వాటిని పీవో పరిశీలించారు. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పరిధిలోని గంటలగుంట గొత్తికోయగూడానికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని అక్కడి వాసులు జోగయ్య, పాపయ్య వినతి పత్రం అందించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని మంగపేట మండలం రాంచంద్రునిపేట వాసులు సమ్మయ్య, తదితరులు విన్నవించారు. ఐటీడీఏ ద్వారా జీవనోపాధి కల్పించాలని వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన పాయం నర్సింహరావువేడుకున్నారు. అదే మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన పాయం రాందాసు రైస్‌మిల్లు ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని వినతి పత్రం అందించారు. గొత్తికోయవాసులకు చెందిన వ్యవసాయ భూమిని కొందరు వ్యక్తులు తమ పేరిట ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు చేయించుకున్నారని, వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఏటూరునాగారం మండలం రాయబంధం గొత్తికోయ వాసులు పీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, డీడీ పోచం, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

వాయిదా పడిన సంత వేలం

భూపాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి, జంగేడు, కాశీంపల్లిలో నిర్వహించాల్సిన వారాంతపు సంతల వేలం పాట తాత్కాలికంగా వాయిదా పడింది. గంప చిట్టీ వేలం మాత్రమే జరగ్గా రూ.8.66 లక్షలకు ఓ కాంట్రాక్టరు దక్కించుకున్నారు. సోమవారం భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని వారంతపు సంతలు, గంప చిట్టీల వేలం పాటలు మునిసిపాలిటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ అధ్వర్యంలో కార్యాలయంలో నిర్వహించారు. సంత వేలం పాటలో పాల్గొనడానికి ఒక్కరు కూడా మొగ్గుచూపకపోవడంతో వాయిదా వేసినట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. భూపాలపల్లి, కాశీంపల్లి, జంగేడు, వారాంతపు సంత వేలం పాటలో పాల్గొనడానికి రూ.6,66,773 డీడీ చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో అధికంగా రుసుం పెట్టారని భావించిన కాంట్రాక్టర్లు వేలం పాటలో పాల్గొనలేదని తెలుస్తోంది. ఇదిలావుండగా గంప చిట్టీ వేలం పాటలో జమ చేయాల్సిన ధరావత్తు (డీడీ) రూ.4,50,131 ఉండగా తొమ్మిది మంది పాల్గొన్నారు. ఇందులో తొగరి తిరుపతి అనే కాంట్రాక్టరు ఏకంగా రూ.8.66 లక్షలు పాడి దక్కించుకున్నారు. ఈ కాంట్రాక్టరు 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మాత్రమే గంప చిట్టీ వసూలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రమేష్, ఆర్ఐ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 సంవత్సర రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లాలో 432 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 1.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న ఏప్రిల్ మాసం నుంచి ప్రారంభం కానున్న రబీ ధాన్యం కొనుగోళ్లకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏజెన్సీలకు ఇప్పటికే కేటాయించిన కేంద్రాల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వేసవి నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే తరలించాలని సూచించారు. సివిల్‌సప్లై, రెవెన్యూ, సహకార, ఐకేపీ, పోలీస్, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా శాఖలు సమన్వయంతో కలిసి పని చేసి జిల్లా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రైతులకు ధాన్యంకు సంబంధించిన డబ్బులను వెంటనే జమ అయ్యే విధంగా వారి వివరాలు స్వీకరించాలన్నారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల వారికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మ చారి, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, మధూసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, విజయనిర్మల, ప్రేమ్‌కుమార్, డీఎస్పీ తిరుపతిరావు, కృష్ణవేణి, విజయ, మూర్తి, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ. అమ్జద్ పాషా మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో సింజంట కంపెనీ మొక్కజొన్న పంటను సుమారు 19 ఎకరాల్లో రైతులు సాగుచేశారని, విషపూరితమైన నకిలీ విత్తనాలు ఇవ్వడం మూలంగా రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన బాధిత రైతులకు రూ.లక్షా50వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పహణీ నకళ్ల ఆధారంగా రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయడంతోపాటు సన్నధాన్యం బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని, అర్హులైన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని, గోవిందరావుపేట మండలం లక్నవరం, వెంకటాపూర్ మండలం రామప్ప కాలువల రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలని, మిర్చి రైతులకు క్వింటాకు రూ.25 వేల ధర చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, ములుగు జిల్లాలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాసంగి రైతులకు దేవాదుల నీటిని ములుగు మండలంలోని లక్నవరం ముంపు రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నెలరోజుల పాటు అందించాలన్నారు. ధర్నాకు సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు ఇంజం కొమురయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయుకలు బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, సారయ్య, వాసం రమేష్, ధనసరి పాణి, మర్రి స్వామి, మహేందర్, సాంబయ్య, వెంకటరమణ, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

- ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను ప్రైవేటీకరించాలనుకోవడం సరికాదు
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వాటిని అంగన్‌వాడీలు ఐక్యంగా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల మహాధర్నా, వంటావార్పు జరగ్గా వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను ప్రైవేటీకరించడానికి బడా కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు ఫుడ్ సప్లయ్ బాధ్యతలను అప్పజెప్పే ఫుడ్ ప్యాకెట్లను కొని పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఈ చర్యల వల్ల భవిష్యత్తులో ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థ ఉండదని, నిరుపేద మహిళలకు పౌష్టికాహారం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐసీడీఎస్‌లో చేయడానికి నూతన జాతీయ విద్యా విధానం, పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకుంటుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ పిల్లలను విద్యావ్యవస్థలో విలీనం చేయడానికే పీఎంశ్రీ పథకమన్నారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాల్సిందిపోయి కొత్తకొత్త సంస్కరణలతో ఐసీడీఎస్‌ను భ్రష్టు పట్టిస్తోందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించాలని, మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం



మహాధర్నాలో మాట్లాడుతున్న వీరయ్య

రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలకు పెంచి జీవో విడుదల చేయాలని, రిటైర్డు అయినవారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కనీస వేతనం రూ.18వేలు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎమ్డీ.గఫూర్‌పాషా, నాయకులు సోమ మల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్.రవి, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కూరెందుల సమ్మక్క, నాయకురాళ్లు పద్మారాణి, సరిత, రమ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకటరమణ, పార్వతి, లక్ష్మీనర్సమ్మ, సుమలత, రుక్మిణి, నిర్మల, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఆర్.నీలాదేవితో పాటు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వాలు

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా తాగు నీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్న వారి సమస్యలను పరిష్కరించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య విమర్శించారు. వాజేడు మండలం నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు గుడిసె వాసులు తాగునీటి, విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టి ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇందులో పాల్గొన్న వీరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసీల సమస్యలు పట్టడం లేదని, నిరుపేదలకు వంద గజాల స్థలమిచ్చి సొంత ఇళ్లు నిర్మించి ఆదుకోవాలన్న విషయాలు ప్రభుత్వాలకు పట్టడం లేదని దుయ్యబట్టారు.

ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందే నిరుపేదలకు వంద గజాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మిస్తానని హామీనిచ్చారని, దాని గురించి ఇప్పటి వరకు ముందుడుగు పడలేదని అన్నారు. 10 ఏళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ డబులు బెడ్‌రూం ఇళ్ల పేరుతో మోసం చేసి నేడు ఫామ్‌హౌస్‌లో సేద తీరుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎమ్డీ దావూద్, పొదిళ్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, రాజేష్, దామోదర్, దేవయ్య, కృష్ణ బాబు, పూనెం కృష్ణ, బత్తుల సంతోష్, నరేష్, చంద్రశేఖర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ?

- రాజలింగమూర్తి హత్య కేసులో ఎనిమిదో నిందితుడు
- క్రెడిట్‌కార్డు లావాదేవీల ఆధారంగా దొరికిన ఆచూకీ
- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న భూపాలపల్లి పోలీసులు ?

కృష్ణకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 19న జరిగిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో కీలక సూత్రధారి, ఎనిమిదో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ నేత, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు ఎట్టకేలకు పోలీసులకు చిక్కినట్టు తెలుస్తోంది. బుధవారంతో హత్య జరిగి నెల రోజులు అవుతున్న క్రమంలోనే ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇన్ని రోజులుగా జిల్లాపోలీసు యంత్రాంగాన్ని ముప్పు తిప్పలు పెడుతూ తప్పించుకొని తిరుగుతున్న హరిబాబు ఢిల్లీలో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి ఢిల్లీకి వెళ్లిన అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్య జరిగిన గంటల వ్యవధిలో అదృశ్యమైన కొత్త హరిబాబు ఆచూకీ ఇన్నాళ్లు పోలీసులకు లభించలేదు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఆయన్ను అరెస్టు చేసే విషయంలో మెతక వైఖరి అవలంబిస్తున్నారని రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో పాటు ఈ నెల 11న డీజీపీకి సైతం రాజలింగమూర్తి భార్య ఫిర్యాదు చేశారు. దీంతో చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు హరిబాబుకు సంబంధించిన ఫోన్ డేటా, ఆధార్, ఫోన్‌నెంబర్లతో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల లావాదేవీలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో హరిబాబుతో పాటు ఆయన సన్నిహితుల ఖాతాలు, క్రెడిట్ కార్డులపై కూడా నజర్ వేశారు. ఈ క్రమంలో పోలీసుల పరిశీలనలో ఉన్న క్రెడిట్ కార్డుల్లో ఒకదానిపై ఢిల్లీలో లావాదేవీలు జరిగాయన్న విషయాన్ని తెలుసుకున్నట్టు వెల్లడైంది.

దీంతో వెంటనే అప్రమత్తమైన ఎనిమిది మంది పోలీసులను నాలుగు బృందాలుగా విడగొట్టి ఆయన్ను పట్టుకొనేందుకు ఢిల్లీకి పంపారు. క్రమంలో పోలీసులు అనుమానించినట్టుగానే సంబంధిత ప్రాంతంలో ఆయన కదలికలను గుర్తించి ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు పోలీసు శాఖకు చెందిన విశ్వసనీయ వర్గాల ద్వారా తెలి సింది. ఇదిలా ఉండగా జిల్లా పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఆయన్ను మంగళవారం అరెస్టు చూపించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ హత్య కేసులో పదో నిందితుడిగా ఉన్న పుల్ల సురేష్ ఇంకా పట్టుబడాల్సి ఉంది

రౌడీషీట్ ఓపెన్ ?

రాజలింగమూర్తి హత్య కేసుతో పాటు గతంలో హరిబాబుపై పలు రకాల కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో హత్య జరిగిన తర్వాత ఏడుగురు నిందుతుల అరెస్టును చూపిన ఎస్పీ కిరణ్‌ఖరే పరారీలో ఉన్న హరిబాబు వివరాలు వెల్లడించారు. త్వరలోనే ఆయనపై రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తామని ప్రకటించారు. దీంతో వివిధ రకాల కేసులను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారనే కారణాలతో ఆయనపై రౌడీషీట్ సైతం ఓపెన్ చేసినట్లు సమాచారం.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

డీడీ దేశిరాం నాయక్



కొత్తగూడలో ఎంపికను ప్రారంభిస్తున్న ఐటీడీఏ డీడీ దేశిరాం నాయక్

కొత్తగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీడీ దేశిరాం నాయక్ సూచించారు. ఐటీడీఏ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశ ఎంపికను సోమవారం కొత్తగూడలో డీడీ దేశిరాం నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగూడలోని ఐటీడీఏ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశ ఎంపికలో 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. బోయిన్‌పల్లిలో మోడల్ వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు 10విద్యార్థినిలు, 10మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో రాములు, ఏటీడీవో భాస్కర్, హెచ్ఎం సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ సీహెచ్ కొమ్మాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌కు 16 వేల మిర్చి బస్తాల రాక

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మార్కెట్‌కు భారీగా మిర్చి రాబడులు వచ్చాయి. సోమవారం 16 వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగాయి. ఉదయం ఈ నామ్‌లో 7218 బస్తాలు వేలం పాటలు కొనసాగగా వ్యాపారులు కొనుగోలు చేపట్టారు. మిగతా సుమారు 8 వేల బస్తాలు ఇంకా మార్కెట్ యార్డులో మిగిలి ఉన్నాయి. మంగళవారం, బుధవారం వేలం పాటల కోసం మార్కెట్ అధికారులు చేతిరాతతో ఉన్న టోకెన్‌లను మిర్చి రైతులకు అందించారు. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం వచ్చే బస్తాలను కూడ వారు బుధవారం వేలం పాటల్లో పాల్గొనేందుకు తీసుకోనున్నారు. పండుగ తర్వాత మార్కెట్ పునఃప్రారంభం కావడంతో భారీగా మిర్చి రాబడులు వచ్చాయి. తేజరకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.13811 పలుకగా, కనిష్ట ధర రూ.10681 పలికింది. సగటున రూ.12650 ధర పలికింది.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చి)	4400	3400
కందులు	6652	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6825	5800
దీపిక	16000	15245
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13500	9000
తేజ ఏసీ	16500	14000
వండర్‌హాట్	15800	11500
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్‌పట్టి	32000	35000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మొక్కజొన్న రైతులతో ఆర్డీవో సమావేశం

నష్ట పరిహారంపై చర్చ

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట సాగుచేసి దిగుబడి రాక నష్టపోయిన వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల రైతులు, సింజెంటా, బేయర్ విత్తన కంపెనీల ప్రతినిధులతో ములుగు ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి సురేష్ సోమవారం సమావేశమయ్యారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. అయితే అదనంగా పరిహారం చెల్లించాలని రైతుల పక్షాన కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల క్షేత్రస్థాయిలో చేసిన పంటల సర్వే నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తామని, పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.



రైతులు, విత్తన కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

ఈజీఎస్‌లో ఇష్టారాజ్యం

తనిఖీల్లో బయట పడుతున్న అవకతవకలు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలంలో జాతీయ ఉపాధిహామీ (ఈజీఎస్) పథకంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవకతవకలు పాల్పడిన విషయాలు సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. 2023-2024 సంవత్సరంలో మండలంలోని 29 గ్రామాల్లో కూలీలకు రూ.3,38,50,285 చెల్లించగా, మెటీరియల్ పేమెంట్‌గా రూ.26,56,609 మొత్తం రూ.3,62,06,894 పనుల జరిగాయి. జరిగిన పనులకుగాను 15వ విడత సామాజిక తనిఖీ బృందం మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. సోమవారం వెల్లికట్టె, వెంకటాపురం, మడిపల్లి, చెర్లపాలెం, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి తనిఖీ వివరాలను వెల్లడించారు. వెల్లికట్టె గ్రామంలో రూ.19,83,214 వెజిపేమెంట్, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.40,371 పనులు జరిగాయి. సిబ్బంది మస్టర్లను దిద్ది కూలీలు చేసిన పనికి తక్కువ, చేయని పనికి ఎక్కువగా కూలీ డబ్బులు జమ చేశారు. ఎం.ఐ ట్యాంకు వద్ద 48 మంది కూలీలు పనులు చేయగా రూ.9,167 చెల్లించలేదు. క్వాంటిటీ తక్కువ చేసి రూ.3,353 బిల్లులు చేయడం జరిగింది. ఎంబీ రికార్డులు తక్కువ రికార్డు చేసి పేమెంట్ ఎక్కువగా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించారు. పోస్టాఫీసులో కూలీల డబ్బుల జమ అయిన కూడా కూలీలకు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంకటాపురంలో మస్టర్ ముగిసిన తర్వాత హాజరువేసుకొని రూ.3,446, ఫీడర్ చానల్ వర్క్‌లో ఎలాంటి రికార్డు క్లియర్ చేయకుండానే రూ.59వేలు చెల్లించారు. ఎలాంటి సంతకాలు లేకుండానే రూ.3500 చెల్లించారు. చెర్లపాలెంలో ఈకేవైసీ లేదంటూ పనులు చేసిన వారికి డబ్బులు చెల్లించలేదు. పని చేయని కొంత మందికి సిబ్బంది పేమెంట్ చేసి డబ్బులు చెల్లించారు. ప్రతి గ్రామంలో టీఏ, ఎఫ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. అయితే అవకతవకలపై తనిఖీ బృందం వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు ఇస్తూ సీఓ, సాంకేతిక కారణం వల్లనే ఇలా జరిగిందంటూ తప్పించుకుంటున్నారు. ఆయా గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి ప్రభు, ఎస్సార్పీ చెన్నకేశవ్, డీఆర్పీ వికాస్, శ్రీశైలం, రామ్మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వెల్లికట్టెలో సామాజిక తనిఖీల్లో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ వికాస్

బాధ్యతలు స్వీకరించిన ట్రైబల్ వర్సిటీ వీసీ



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వై.ఎల్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు మండలం జాకారంలోని వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో విధుల్లో చేరిన ఆయనకు ఓఎస్డీ వంశీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అంతకు ముందు తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న వీసీ సంప్రదాయ పూజలు చేశారు. పూజారులు ఆయనకు కండువా కప్పి ప్రసాదం అందజేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్. దివాకరను వీసీ శ్రీనివాస్ కలిశారు.

వడదెబ్బతో ఒకరి మృతి



రాజు మృతదేహం

కేసముద్రం, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) : కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున ముత్యాలమ్మగుడి సమీపంలో పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు(48) వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ముత్యాలమ్మగుడి వద్ద మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతుని ఫొటోలతో సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ సమూహాలకు పంపించారు. దీంతో మృతుడికి సంబంధించిన వారు గుర్తించి పోలీసులను సంప్రదించారు. మృతుడు నెల రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయి ఆచూకీ తెలియకుండా వివిధ ప్రాంతాలు తిరుగుతున్నాడని, మద్యానికి బానిసై ఆహారం సరిగా తీసుకోకుండా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య హైమ, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) : విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన డోర్నకల్ మండలం గుర్రాలకుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రాలకుంట తండాకు చెందిన నూనావత్ సరు (40) భర్త రాము లు కలిసి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కూలీ పనులకు వెళ్లిన భార్యాభర్తలు ఇంటికి వచ్చారు. ఆపై సరు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్ స్విచ్ ఆన్ చేయడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రాజేష్‌ను వివరణ కోరగా తమకు ఇప్పుడే సమాచారం అందిందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నిట్ చైర్‌పర్సన్ విధుల అప్పగింతపై సవరణ

వరంగల్ నిట్ -2017 స్టాచ్యూట్‌లో సబ్‌సెక్షన్ 4 చేర్పు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా కారణం వల్ల బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ విధుల్లో లేని కాలంలో ఆయన బాధ్యతలను మరో జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగించే విషయంలో సవరణ చేస్తూ వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గెజెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ పదవీ కాలం ముగియడం, మృతి చెందడం, రాజీనామా చేయడం లేదంటే ఇతరత్రా కారణాల వల్ల ఖాళీ అయినా.. అనారోగ్యం, గైర్హాజరు లేదా మరే కారణం వల్ల విధులు నిర్వహించలేక పోయినా చట్టంలోని 16వ సెక్షన్ ప్రకారం ఆయన స్థానంలో జాతీయ ప్రాధాన్యత కలిగిన మరో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగిస్తూ సవరణ చేశారు. అయితే ఈ బాధ్యతల అప్పగింత కాలపరిమితి ఆరు నెలల వరకు లేదంటే ఒక వేళ చైర్‌పర్సన్ కాలపరిమితి ముగిసిన పక్షంలో మరో రెగ్యులర్ చైర్‌పర్సన్ నియామకమయ్యే వరకు వరంగల్ నిట్ విజిటర్ ఆమోదం మేరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్స్ -2017లో సబ్-స్టాచ్యూట్ (4)ను చేర్చడం ద్వారా ఈ సవరణ చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్-2017ను ఇక నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్-2025గా పిలుస్తారు.

నిరంతర సాధన అవసరం



నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్లు వచ్చి చేతి రాతకు పెద్దగా పనిలేకుండా చేశాయి. దీనికి తోడు చాలా విద్యాసంస్థలు కేవలం బట్టీ పట్టించేందుకు చదువు మీద పెట్టిన శ్రద్ధను విద్యార్థుల చేతి రాతపై పెద్దగా పెట్టడం లేదు. దీని వల్ల పరీక్షల్లో జవాబులు అన్నీ సరిగానే రాసినప్పటికి అందమైన చేతి రాత లేక మార్కులు తగ్గిపోయి విద్యార్థులు నష్టపోతున్నారు. అందుకు ఒక్కసారి అందంగా రాయడం నేర్చుకుంటే జీవితాంతం అందంగానే రాయవచ్చు.

- రెడ్డిమల్ల వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

అందమైన రాత చాలా ముఖ్యం



చదవడంలో ఎన్ని మార్పులు వచ్చినా, అలాగే ఆన్‌లైన్ పుస్తకాలు చదివి పరీక్షలు రాసే పద్ధతి వచ్చినా చేతి రాతకు ఉండే ప్రాముఖ్యత నేటికీ తగ్గలేదు. ఇందుకోసం ప్రతీ విద్యార్థికి అందమైన చేతి రాత అనేది చాలా ముఖ్యం. పరీక్షల్లో రాసే జవాబులు అందంగా కనిపిస్తే పేపర్లు దిద్దే వారు గుర్తించి అదనపు మార్కులు వేసే అవకాశాలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు చేతి రాతకు కూడా ప్రాధాన్యమివ్వాలి. చదివింది, రాయడం వల్ల చాలా వరకు గుర్తుండిపోతుంది.

- పోగుల నాగరాజు, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

చేతి రాత.. మారాలి!

అక్షరాలు అందంగా ఉంటేనే మరిన్ని మార్కులు

- సాధన చేస్తేనే అలా రాయడం సాధ్యమంటున్న ఉపాధ్యాయులు
- పదో తరగతి విద్యార్థులకు మరింత మేలు
- 21 నుంచి వార్షిక పరీక్షలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్‌పై క్షణాల్లో అందమైన అక్షరాలను తీర్చిదిద్దగల ఈ ఆధునిక యుగంలో, చేతి రాతకున్న ప్రత్యేకత ఏమాత్రం తగ్గలేదు. చేతి రాతను బట్టి వారి గుణగణాలను చెప్పవచ్చనేది నానుడి. పరీక్షల వేళ జవాబు పత్రాలు దిద్దే ఉపాధ్యాయులకు అక్షరాలు అందంగా కనిపించేలా జవాబులు రాస్తే చాలు ఇక అదనపు మార్కులు సాధించవచ్చని వేరే చెప్పక్కర్లేదు. ఇందుకోసం విద్యార్థులు నిరంతరం సాధన చేస్తేనే అందమైన చేతి రాత సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతీ విద్యార్థి చేతి రాతకు ఉన్న గుర్తింపు గురించి తెలుసుకుని, అందుకు అనుగుణంగా మార్చుకుంటేనే భవిష్యత్తులో అన్నింటికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, పదో తరగతి పబ్లిక్ పరీక్షల వేళ చేతి రాతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పరీక్ష సమయంలో తడబాటు..

పరీక్షల గంట మోగింది. ఈనెల 21వతేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు పది పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు అంటే విద్యార్థులకు తెలియని భయం. ఆ భయంతో పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను రాసే క్రమంలో చేతి రాత వంకరటింకరగా వస్తుంది. ఇంకొందరు విద్యార్థులు ముందుగా అందంగానే మొదలు పెట్టినప్పటికీ, పోనుపోను అందంగా రాయలేక ఇష్టం వచ్చినట్లు రాస్తుంటారు. దీంతో ప్రశ్నలకు, జవాబులు సరిగా రాసినప్పటికి చేతి రాత సరిగా లేకపోవడంతో పేపర్లు దిద్దే వారికి సరిగా అర్థం కాకపోవడం వల్ల మార్కులు కూడా తగ్గే ఆస్కారం ఉంది. కాబట్టి ముందు నుంచే విద్యార్థులు చేతి రాతపై దృష్టి పెట్టాలి. చదివిన దానిని చేతి రాతతో రాయడం వల్ల మరిచిపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి రాయడం వల్ల అందమైన దస్తూరి రావడంతో పాటు చదివింది కూడా గుర్తుకు ఉండడానికి ఉపకరిస్తుంది. ఇలా రెండు రకాలుగా తోడ్పడుతుంది. అందమైన చేతి రాతతో అక్షరాలను పొందికగా ముత్యాల్లాగా పేర్చి ఆకర్షించే విధంగా జవాబులు రాయడం వల్ల పేపర్లు దిద్దే వారికి రాసిన జవాబులు అందంగా కనిపించడంతో అదనపు మార్కులు పొందే అవకాశాలు చాలా ఉన్నాయి.





ల్యాబర్తిలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు...

- విద్యార్థులు పరీక్షల్లో జవాబులు రాసేటపుడు అక్షరాలు పొందికగా, ముత్యాల్లాగా పేర్చినట్లు అందంగా కనిపించాలి. అదేవిధంగా స్పష్టంగా రాయాలి.
- ఒక్క పేజీలో కేవలం 16 నుంచి 18 లైన్లు మాత్రమే వచ్చే విధంగా రాయడం మంచిది.
- సమాధాన పత్రం పైకి, కిందికి పక్కలకు బార్డర్లకు వదిలి సమానంగా రాయాలి.
- పరీక్ష రాసేటపుడు ఒద్దికగా పూర్తిగా అనుకూలంగా కూర్చొని రాయాలి.
- తెలుగు, హిందీ, అక్షరాలను నాలుగు మి.మీ.లే, ఇంగ్లీష్ అక్షరాలను మూడు మి.మీ.లు ఉండే విధంగా చూసుకోవాలి.
- అక్షరాలు, పదాలు, లైన్‌ల మధ్య తగినంత గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.
- అక్షరాలను ఒత్తిపెట్టి రాయకూడదు. అలా రాయడం వల్ల పేజీ వెనుక భాగం వైపు కనిపిస్తుంది. దీని వల్ల వెనక వైపు ఉన్న రాత కూడా కనిపించకుండా పోయి నష్టపోవాల్సి వస్తుంది.
- గణితంలో సమీకరణాలు, సైన్స్‌లో పటాలు, పోటీభాగాలు అందంగా కనిపించే విధంగా రాయాలి.
- జవాబులు రాసేటపుడు వాటికి సైడ్ హెడ్డింగ్‌లు. పేరాలు చేయాలి.
- తెలుగు, ఇంగ్లీష్ రాసేటప్పుడు ఎప్పుడు సవ్య దిశలోనే రాయాలి.

చెట్ల నీడన చదువు..



ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇంటర్ విద్యార్థుల్లో వార్షిక పరీక్షల వేడి. ఈ క్రమంలో వారు మంచి మార్కులు పొందాలంటే అనువైన వాతావరణం ఉండాలి. ప్రకృతి కన్నా అనువైన వాతావరణం ఏముంటుంది. మరీ ముఖ్యంగా చెట్ల నీడలో చదువుకోవడం కంటే ఆనందం ఇంకేముంటుంది. అందుకే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనారిటీ కళాశాలలో విద్యార్థులు ఇదిగో ఇలా అందరూ చెట్ల నీడన కుర్చీలు వేసుకుని కూర్చుని చదువుకుంటున్నారు.

చెట్ల నీడలో కూర్చొని పరీక్షకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి



మహబూబాబాద్‌లో జయరాజ్‌ను సన్మానిస్తున్న ఘనపురపు అంజయ్య దంపతులు

తెలంగాణ సంస్కృతి అంటేనే పాట

- కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్
- గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయం
- ప్రముఖ కవి, గాయకుడు గొడిశాల జయరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి అంటేనే పాట అని, ఏ ఉద్యమానికైనా ఆ పాట వెన్నుదన్నుగా, ముఖ్య భూమికగా నిలిచిందని ప్రముఖ కవి, గాయకులు గొడిశాల జయరాజ్ అన్నారు. తన సొంతూరు మహబూబాబాద్ పట్టణానికి విచ్చేసిన ప్రముఖ కవి, గొడిశాల జయరాజ్‌ను సోమవారం కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయరాజ్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా నిలిచిన పోరాటయోధులకు గత పదేళ్లలో ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కవులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన పాటను తెలంగాణ గీతంగా ప్రకటించడం, తన కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్‌ను సినీ పరిశ్రమను విడదీయలేరని 'బండెనక బండి కట్టి.. ఏ బండ్లె పోతావు కొడుకో.. నైజాం సర్కరోడా' అంటూ గద్దర్ రాసిన, పాడిన అనేక పాటలు వెండితెరపై ఉర్రూతలూగాయని చెప్పారు. వెండి తెరనుంచి గద్దర్‌ను తొలగించలేరని, సినీ పరిశ్రమకు ఆయన పెద్ద దిక్కుగా నిలిచారని వివరించారు. సాంస్కృతిక చిహ్నంగా గద్దర్ పాటలు నిలిచాయని తెలిపారు. విద్యార్థి ఉద్యమాలు.. విప్లవోద్యమమైనా.. తెలంగాణ ఉద్యమంలోనైనా కవిగా నిలబడడానికి ఘనపురపు అంజయ్య తనకు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు.

ఉద్యానంలో యువజోష్

- కొత్తవంగడాలతో కాసుల పంట
- ప్రత్యామ్నాయ సాగులో ఆదర్శంగా రైతులు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడమంటేనే అప్పులు, ఆత్మహత్యలు అంటూ వదిలేసి, చిన్న ఉద్యోగమైనచాలని పట్టణాల వైపు పరుగులు పెడుతున్న రోజులివి. కానీ వ్యవసాయం దండగ కాదు పండుగని నిరూపిస్తున్నారు ఈ యువ రైతులు. తమ తల్లిదండ్రులు నమ్ముకున్న భూమినే అమ్మలా భావించిన ఆ యువకులు ఉద్యానపంటల్లో కొత్త వంగడాలను ఎంచుకుంటూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేసి.. వ్యాపించే తెగుళ్లు, రోగాలతో రైతులు అప్పుల పాలవుతున్న నేపథ్యంలో అత్యాధునిక వంగడాలతో ఉద్యాన పంటల్లో.. మెళకువలు, బిందు సేద్యం, మల్చింగ్ విధానం పాటిస్తూ రాణిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి, గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువత రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి. వీరు తమతమ భూముల్లో లాభాలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు.



అమ్మాపురంలో రైతు అశోక్‌రెడ్డి సాగు చేస్తున్న బీరకాయ తోట



జీకే తండాలో రమేష్, రవి సాగు చేస్తున్న చామంతి పూలసాగు

సీజనల్‌గా పండిస్తూ లాభాల బాట

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామశివారు కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి తనకు ఉన్న 10ఎకరాల భూమిలో తండ్రి వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించారు. ప్రత్యామ్నాయ పంటలతోనే లాభాలు వస్తాయని గ్రహించి ఐదేళ్లుగా ఉద్యాన పంటలైన సీజనల్ కూరగాయల సాగు, పుచ్చకాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఎకరాల్లో పామాయిల్, రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, ఇతర సీజనల్ కూరగాయలు వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్స్, మల్చింగ్ విధానాన్ని పాటిస్తూ నీటిని ఆదాచేస్తూ, కలుపు నివారణతో ఖర్చులు తగ్గిస్తూ, సాగు చేపడుతున్నారు. కూరగాయలు అధిక ధరలు పలికే వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించడంతో పాటు చిన్న, సన్నకారు వ్యాపారులు తోట వద్దకు వచ్చి తీసుకొని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీరసాగు ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా పామాయిల్ పంటలో అంతర్‌పంటగా పుచ్చకాయల సాగును చేపట్టారు.

చామంతి సాగుతో ఆదాయం

తొర్రూరు మండలం గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువ రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి పూలసాగు చేయాలని హార్టికల్చర్ అధికారులను సంప్రదించారు. సాగుపై ఉన్న సబ్సిడీలను తెలుసుకొని పూల సాగులోనే బంగారు భవిష్యత్ ఉందని పూలసాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. రమేష్ తన అన్న రవితో కలిసి జీకే తండాలో ఉన్న ఆరు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని సీజన్ వారీగా చామంతి సాగు చేయడంతో పాటు మూడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేశారు. ఎకరం భూమిలో సరిపోయే 1.60 లక్షల మొక్కలను ఒక్కొక్కటి రూ.3చొప్పున కొనుగోలు చేసి నాటగా 100 నుంచి 120 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. ఈ పువ్వులను ఎక్కువగా వివాహ, శుభకార్యాలకు, అలంకరణకు ఉపయోగించడంతో అధిక ధర పలుకుతోంది. చేతికి వచ్చిన పువ్వులను పది మొక్కల వరకు కటింగ్ చేసి బంచ్‌గా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఎకరంలో సుమారు 15 వేల బంచ్‌లు దిగుమతి వస్తుంది. ఒక్క బంచ్ రూ.100 నుంచి రూ.150 ధరతో సీజన్ బట్టి విక్రయిస్తుంటారు. మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హైదరాబాద్, పెద్దపెద్ద డేకరేషన్ హాల్స్‌కు పంపిస్తుంటారు. మొక్కలుగా కోసి ఇవ్వడంతో పువ్వు వాడిపోకుండా పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఎకరానికి రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టగా, చామంతి పూలతో సంవత్సరానికి రూ.15 లక్షల ఆదాయం వస్తే, కూలీల ఖర్చు, ఎరువు మట్టి, ఇతర ఎరువుల ఖర్చు, మొక్కల ఖర్చు సుమారు రూ.8 లక్షల వరకు వస్తుంది. సుమారుగా సంవత్సరంలో రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీనికి తోడు మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట ఆదాయంతో పాటు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కలిసొస్తోంది. సంప్రదాయ పంటల కంటే ఉద్యాన పంట సాగుతోనే అధిక లాభాలు వస్తున్నాయని యువ రైతులు ధీమాగా చెబుతున్నారు. వీరితో పాటు ఇదే గ్రామానికి చెందిన గుగులోతు భిక్షం అనే రైతు ఎకరం భూమిలో బెండకాయ, బుడంకాయ, దోసకాయ సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు.


నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమాయత్తం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఏప్రిల్, మే నెలల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. 16 సర్కిళ్ల అధికారులతో సీఎండీ సోమవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. లోడ్ పెరిగే ఆవకాశం ఉన్న ప్రతీ చోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్‌లో కోతలు పూర్తైన తర్వాత వ్యవసాయ సర్వీసులను త్వరతగిన మంజూరు చేయాలన్నారు. అందుకు తగ్గట్లు మెటీరియల్ పూర్తి చేసుకోవాలన్నారు. బంచ్డ్ ఫీడర్లు ఉన్న చోట వీసీబీలు పెట్టి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వోల్టేజీని మెరుగుపరచడానికి లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

25 ఏళ్ల నాటి బ్యానర్ పునరావిష్కరణ




నాటి ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా, వినయ్‌భాస్కర్, నరేందర్ తదితరులు

మట్టెవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు 25 ఏళ్ల నాటి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార బ్యానర్‌ను సోమవారం రాత్రి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో పునర్ ఆవిష్కరించారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు జడ్పీటీసీగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వస్త్రంపైన బ్రష్‌తో రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దాచిపెట్టి ఉంచారు. ప్రస్తుతం పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న నేపథ్యంలో కేసీఆర్‌తో ఆ బ్యానర్‌ను పునరావిష్కరింపజేసి.. నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తినే నమ్ముకున్నాడు.. కళాఖండాలు తీర్చిదిద్దుతున్నాడు..

సూక్ష్మకళలలో సత్తా చాటుతున్న జయకుమార్



సూక్ష్మకళాకారుడు జయకుమార్



మైక్రో ఆర్టిస్ట్ జయకుమార్ తయారు చేసిన భారతచిహ్నం



సహజ పూలతో సూక్ష్మ బతుకమ్మ చిత్రం

నర్సంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదివిన అతడికి కొలువు దొరకలేదు. నిరుత్సాహ పడకుండా కులవృత్తినే జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తండ్రి వద్ద స్వర్ణకారవృత్తిని ఒంటపట్టించుకున్నాడు. దీంతో ఏదో సాధించాలన్న పట్టుదలతో సూక్ష్మకళాఖండాలను రూపొందించడం ఆరంభించాడు నర్సంపేటకు చెందిన శ్రీరామోజు జయకుమార్. బలపాలపై, సబ్బుబిళ్ల తదితర వస్తువులపై అద్భుతాలు సృష్టిస్తున్నారాయన. నర్సంపేట పట్టణానికి చెందిన భిక్షమాచారి-భద్రమ్మ దంపతుల కుమారుడు జయకుమార్ 1995లో బలపాలపై అద్భుత కళాఖండాలను చెక్కి తన ప్రతిభకు సానబెట్టడం ప్రారంభించారు. నాడు ఈ సూక్ష్మకళాకారుడి కళాఖండాలను, ప్రతిభను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పాఠకులకు తొలిసారి పరిచయం చేసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆయన అనేక అద్భుత కళాఖండాలను సృష్టించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు.

చాక్‌పీసులు, సబ్బులపై శిల్పాలు

జయకుమార్ పెన్సిళ్లు, చాక్‌పీస్‌లు, సబ్బుబిళ్లలపై శిల్పాలు చెక్కి జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. జ్యోతిరావు పూలే అవార్డును కూడా దక్కించుకున్నాడు. 2005 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్‌కు 20 మిల్లీ గ్రాముల బంగారంతో క్రికెట్ బ్యాట్‌ను తయారు చేసి కంటికి కనిపించే అక్షరాలతో మాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2007లో ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను 7మిల్లీ మీటర్ల ముత్యంపై చెక్కి ఓట్‌ఫర్ ద తాజ్ అని చెక్కారు. 2008 ఏప్రిల్‌లో భారత క్రికెట్ చరిత్రలో 600 వికెట్లు సాధించిన కుంబ్లేకు కేవలం 0.15మిల్లీ గ్రాముల బంగారంతో వికెట్లు, బంతి, బేల్స్‌ను తయారుచేసి ఆయనకు కంగ్రాట్స్ అని రాశారు. 2009లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి వైఎస్ఆర్‌కు చింతాకుపై శుభాకాంక్షలు తెలపారు. 2010లో పోస్టుకార్డుపై వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని గీశారు. తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సమయంలో వెంట్రుకపై జైతెలంగాణ నినాదాన్ని లిఖించాడు. బియ్యపు గింజపై తెలుగు అక్షరాలను చెక్కారు. యువకులు అడ్డదారిలో పయనించకుండా ఆధ్మాతిక భావన అలవర్చుకోవాలని ఓంకారంలో లింగాకారాన్ని తీర్చిదిద్దారు. ఈ విధంగా అనేక సూక్ష్మకళాఖండాలను చిత్రించి ప్రశంసలను అందుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులను జయకుమార్ అందుకున్నారు.



ఆకుపై గణపతి చిత్రం

మ్యూజియం ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం

నిరుపేద స్వర్ణకార కుటుంబంలో జన్మించిన జయకుమార్ కంటికి కనిపించని కళాఖండాలను అనేకం సృష్టించారు. ఎన్నో కష్టాల కోర్చి రూపొందించిన ఈ సూక్ష్మ కళాఖండాలను ప్రజలకు చూపించడానికి మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందించాలని, తాను నేర్చుకున్న సూక్ష్మ కళను పదిమందికి నేర్పడంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని జయకుమార్ కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో 'ఏఐ' విద్యా బోధన

కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను వినియోగిస్తూ సులభతరంగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని ఐదు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ద్వారా నిర్వహించే విద్యాబోధనలో భాగంగా మండలంలోని చల్వాయి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. విద్యార్థులు కంప్యూటర్‌లో చేస్తున్న తెలుగు, ఆంగ్లానికి సంబంధించిన ప్రమాణలాను పరిశీలించారు. గణితంలో సంఖ్యా భావనలు, కూడికలు, తీసివేతలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లావ్యాప్తంగా ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ సహకారంతో వర్చువల్ రియాల్టీ విధానంలో పాఠాలు చెప్పేల ప్రారంభించుకున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3నుంచి 5వతరగతి విద్యార్థులకు కనీస విద్యాప్రమాణాలు, అభ్యాసన సామర్థ్యాలను పెంచే లక్ష్యంగా ఏఐ ద్వారా బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇప్పటికే ఆరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాన్ని ప్రారంభించగా అక్కడ మంచి ఫలితాలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలోని మిగతా జిల్లాలతోపాటు ములుగు జిల్లాలో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పదోతరగతి విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. వారికి పాఠాలు బోధించడంతోపాటు వార్షిక పరీక్షలకు వచ్చే నాలుగురోజులు చాలా ముఖ్యమైనవని, విద్యార్థులు లక్ష్య సాధనకై శ్రమించాలని, భయం వీడి పట్టుదలతో చదవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదవడం వల్ల



ఏఐ విద్యాబోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

మంచి ఫలితాలు సాధించవచ్చని, దీంతో తల్లిదండ్రులు, పాఠశాల, గ్రామంతోపాటు ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు స్టడీ అవర్ తీరును గమనించి ఉపాధ్యాయులను అభినందించారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో మానసికంగా ఆందోళన పడవద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకుని వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కంటిలోపం లేకుండా ఉండాలంటే సమీకృత ఆహారం తీసుకోవాలని, ఎక్కువగా పండ్లు, క్యారెట్, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈవో పాణిని, వైద్యులు శ్రీనివాస్, జయప్రద, ఎంఈవో దివాకర్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, ఏఎంవో మల్లారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హట్కర్ సమ్మయ్య, చల్వాయి ప్రాథమిక పాఠశాల చైర్మన్ మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ విజయ, ఉన్నత పాఠశాల చైర్మన్ తేళ్ల హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో 3134 మంది విద్యార్థులు

21 తేదీ నుంచి పరీక్షలు

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లా విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 21 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. మొత్తం 3134మంది విద్యార్థులకు గానూ 9మండలాల్లో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఎగ్జామ్ సెంటర్‌కూ ఓ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తోపాటు మొత్తం 170 మంది ఇన్విజిలేటర్లను, మాస్‌కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షణ కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఈసారి పరీక్ష రాసే విద్యార్థుకు 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను అందజేయనున్నట్టు డీఈవో పాణిని తెలి పారు. ఫిజిక్స్, బయాలజీ పరీక్షలకు 12 పేజీల బుక్ లెట్ ఇస్తామన్నారు. ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించామని, ప్రీఫైనల్ పరీక్షల సమయంలో విద్యార్థులకు ఓఎంఆర్‌లు ఇచ్చామని అన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద సౌకర్యాలు

వేసవి సమీపించిన నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేయనున్నట్లు డీఈవో తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద ఓ ఎన్ఎన్ఎం మెడికల్ కిట్‌తో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మండల కేంద్రాలకు దూరంగా ఉన్న కేంద్రాలకుఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సు సర్వీసును నడిపిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షకు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

గుడిసె వాసుల పాదయాత్ర

వాజేడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీఏ సమీపంలో ప్రభుత్వ భూమిలో ఏడాదిన్నర కాలంగా గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్న పేదలు తమ హక్కుల కోసం కదం తొక్కారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్రను నిర్వహించారు. గుడిసెల పోరాట కేంద్రం నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు ప్రారంభమైన ఈ యాత్రను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పాదయాత్ర పూసూరు-ముళ్లకట్ట వంతెన మీదుగా ఏటూరునాగారం ఐటీడీఏ వరకు కొనసాగింది. మండటెండలో సుమారు 17 కిలోమీటర్ల మేర పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ గుడిసె వాసులకు మంచినీరు, విద్యుత్,



పాదయాత్రలో గుడిసె వాసులు

ఇతర మౌలిక సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిందని, నేడు ఆ హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవయ్య, కృష్ణబాబు, దామోదర్, పూనెం కృష్ణబాబు, సంతోష్, కుర్సం ప్రవీణ్, నాగమణి, శాంతకుమారి, శారద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా కంటిచూపు లోపాలను గుర్తించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర కళ్లద్దాల పంపిణీని ప్రారంభించారు. పోషకాహారమైన ఆకుకూరలు, గుడ్లు, చేపలు, పాలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో గోపాల్‌రావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి, రెండో ఐస్క్రీన్ కార్యక్రమాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించి 1,427 మంది విద్యార్థినులను గుర్తించి కళ్లద్దాల కోసం మూడవో స్క్రీనింగ్ నిర్వహించామని, ఇందులో 1219మంది విద్యార్థినుల జాబితాను ప్రభుత్వానికి అందజేశామని అన్నారు. అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి రణధీర్, ములుగు ఏరియా ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు ప్రవీణ్‌రెడ్డి, డెమో సంపత్, వైద్యులు శ్రీలత, మల్లి కార్జున్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెను పాల్గొన్నారు.

వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వివిధ సమస్యలపై అందజేసిన వినతులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరగ్గా ఆయన పాల్గొని ప్రజల నుంచి 19 వినతులు స్వీక రించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని, భూసమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికా రులకు పంపి పరిష్క రించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

రామప్ప ఆలయాన్ని సందర్శించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు

వెంకటాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని సోమవారం హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించగా అర్చకులు ఉమాశంకర్, హరీశ్ శర్మ నుంచి స్వీకరించారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టతను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వారి వెంట హెచ్‌ఆర్‌డీఐటీ అధికారులు శ్రీనివాస్, రవి, తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆశాల వినతి

వెంకటాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కుటుంబసభ్యులకు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, ఎల్‌సీడీసీ, పోలియో, ఎన్‌సీడీ, తదితర సర్వేల డబ్బులు చెల్లించాలని, అర్హులైన వారికి ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఆరునెలల పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బండారి సంధ్యారాణి, రాణి, పూర్ణ, మాధవి, సౌజన్య, కవిత, సునీత, సంధ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

వెంకటాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రా పురం గ్రామ సమీపంలోని గుడిగుట్ట వద్ద సోమవారం లారీలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నల్లగొండ జిల్లా కట్టంగూడ మండలం పరిడి గ్రామానికి



గాయపడిన లారీ డ్రైవర్ సతీష్

చెందిన డ్రైవర్ సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు ఇసుక లారీలు వరుసగా వెళ్తున్నాయి. రామచ ంద్రాపురం గ్రామ సమీపంలోని గుడిగుట్టల వద్దకు చేరుకోగానే రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈఘటనలో లారీ డ్రైవర్ సతీష్ కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్థులు 108కు సమాచారం అందించడంతో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

వాజేడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత సినిమా హాలు సెంటరులో నిర్మించిన కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా వివిధ పూజా



విగ్రహ ప్రతిష్ఠాపనలో భక్తజనం

కార్యక్రమాలు ఆలయం వద్ద జరగ్గా చివరి రోజు అమ్మవారి దివ్యప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి నూతన ఆలయం వద్ద గణపతిపూజ, కలాహోమాలు, మహాపూర్ణాహుతి, దివ్యప్రతిష్ఠ పూజలు వేదపండితులు జరిపించారు. అనంతరం ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా శివసత్తులు పూనకాలు, జై భవని నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగిందిజ విగ్రహప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

గోవిందరావుపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అమలుచేసి గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ భద్రునాయక్, దండోరా జాతీయ నేతన నెమలి నర్సయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలకేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరాహారదీక్షను వారు ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే గ్రూప్స్ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. మంద కృష్ణ మాదిగ చేస్తున్న పోరాటాన్ని అర్థం చేసుకుని వర్గీకరణ చేసిన తర్వాతనే గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని వారు కోరారు. కాగా, దీక్షలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నగుండ్ల వెంకటేశ్వర్లు పాల్గొని మద్దతు తెలిపారు. దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు యనగందుల మొగిలి, జంగిడి ప్రకాష్, కేశపాక కార్తీక్, జన్ను సాంబయ్య, కొత్తపల్లి నరేష్, గోపిదాస్ చిన్నసారయ్య, కొండి రమేష్, పసుల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఏటూరునాగారం రూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు సోమవారం మండలంలో పట్టుకున్నారు. ఆ విభాగ ఓఎస్డీ ఎం. ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా గుండాల వద్ద నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యం ఓ వాహనంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఏటూరునాగారం మండలంలో జంపన్నవాగు వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. సుమారు 175 క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గుండాలలో జంపయ్య అనే వ్యక్తి బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి సత్యనారాయణకు ఎక్కువకు విక్రయిస్తున్నట్టు తమ విచారణలో వెల్లడైందన్నారు. మళ్లీ వీరు మహారాష్ట్రకు బియ్యాన్ని తీసుకెళ్లి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు ఓఎస్డీ తెలిపారు. పీడీఎస్ బియ్యం విక్రయానికి పాల్పడిన జంపయ్య, సత్యనారాయణతో పాటు వాహన యజమాని, డ్రైవర్‌పై కూడా క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్సై జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల డబ్బు మీరెలా హోల్డ్ చేస్తారు?

గోరికొత్తపల్లి బ్యాంకు మేనేజర్‌పై కలెక్టర్ ఆగ్రహం

భూపాలపల్లి కలెక్టరేటట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల డబ్బులు హోల్డ్ చేసే అధికారం మీకు ఎక్కడిదని గోరికొత్తపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లేష్‌పై కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహ వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టిన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. 'ఎవరో ఎందుకు.. నేనే మీపై బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా' అసహనం వ్యక్తం చేశారు. గోరికొత్తపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎం.మల్లేష్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుభరోసా డబ్బులను బాకీ కింద జమ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గోరికొత్తపల్లి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు యాదగిరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొరపెట్టుకున్నాడు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను రుణాలకు ఎందుకు సర్దుబాటు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను రుణాలకు జమ చేయకుండా తక్షణమే రైతులకు చెల్లింపులు చేయాలని ఆదేశించారు. గతంలో చల్లగరిగేలో కూడా ఇలా జరిగిందని, ముమ్ముందు ఇలాంటి ఫిర్యాదులు వస్తే చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

భక్తాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.55 వేలు

భూపాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని హను మాన్‌నగర్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో సోమవారం హుండీని లెక్కించారు. ఆలయానికి ఆదాయం రూ.55,767 వచ్చిందని ఈవో ఆర్.మహేష్ తెలిపారు. ఈ ఆదాయం 2024 సెప్టెంబరు నుంచి 2025 మార్చి 17 వరకు సమకూరిందని వివరించారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత, అర్చకులు, భక్త బృందం పాల్గొన్నారు.

పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు

కృష్ణకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో యానివల్ డే వేడుకలు సోమవారం జరిగాయి. ప్రధానోపాధ్యాయురాలు శాంత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ భాస్కర్, రూరల్ డెవలప్‌మెంట్ ఏటీఎల్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శాంత మాట్లాడుతూ తమ పాఠశాలలో ఆరు సంవత్సరాల నుంచి వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు చెప్పారు. 2023-24 లో చాలా మంది విద్యార్థులు ప్రతిభ చాటగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మలు అభినందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

వెంకటాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్‌పార్టీ లీగల్‌సెల్ చైర్మన్ కరణ్‌కుమార్‌వర్మ ఆధ్వర్యంలో నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కరణ్‌కుమార్‌వర్మ మాటాడుతూ బీఆర్ఎస్ దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అందులో భాగంగానే దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఈవిషయంలో స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ ఎస్సీసెల్ చైర్మన్ రావుల నాని, నాయకులు చిట్టిమల్ల దేవసహాయం, యాసం రమేష్, బొల్లె పురుషోత్తం, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం నెలకు రూ.18వేల వేతనం ప్రకటించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె ఆధ్వర్యంలో మహిళా నాయకురాళ్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నీలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని, పారితోషికాల పేరుతో శ్రమదోపిడీకి గురిచేస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చుంచు మంజుల, నాయకురాళ్లు కవిత, గుండెబోయిన రమాదేవి, రేణుక, సబిత, పద్మ, అరుణ, జ్యోతి, సుజాత, యశోద, సునీత, ధనలక్ష్మి, ఈశ్వరి, స్వర్ణ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

- మంగపేట (ఆంధ్రజ్యోతి) : తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఆశా కార్యకర్తలు విధులను బహిష్కరిం చారు. మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలతో వైద్యులకు సమ్మె నోటీసులు అందజేసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక గ్రామ సభ

కాటారం, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం అభివృద్ధి పనులపై ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవనం, అంగన్వాడీ కేంద్ర భవనం నిర్మాణాలకు ఈజీఎస్ నిధులు రూ.20లక్షలు, రూ.8 లక్షల చొప్పున మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు. భవన నిర్మాణాలను ఎక్కడ నిర్మించాలనే దానిపై గ్రామసభలో చర్చించారు. గతంలోనే మూతబడ్డ రేగులగూడెం పాఠశాల స్థలాన్ని పరిశీలించిన మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, యువకులు గ్రామపంచాయతీ కార్యాలయ భవనానికి అనుకూలంగా ఉంటుందని తేల్చారు. అంగన్వాడీ కేంద్రం భవనం రేగులగూడెం జీపీ పేరిట రాగా జీపీలోని ఐదు కేంద్రాలకు సొంత భవనాలు లేవని సీడీపీవో రాధికను ఫోన్‌లో గ్రామస్థులు అడగ్గా దేవరాంపల్లి పేరిట మార్చాలని లేఖ పెట్టామని తెలిపారు. కాగా గ్రామసభలో పలువురు కార్యదర్శి పనితీరు, వైఖరిని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందరమ్మ ఇళ్లు, పెన్షన్ల గురించి పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తాను సర్వే చేసి వివరాలు నమోదు చేశానని, వాటి మంజూరులో తన ప్రమేయం లేదని కార్యదర్శి సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు దోమ రాహుల్, నంది శంకరయ్య, నవీన్‌కుమార్, వంశవర్ధన్‌రావు, గ్రామపెద్దలు బండి రమేష్, పిల్లమారి రమేష్, తూటి నారాయణ, ముత్తయ్య, బుచ్చయ్య, బాలరాజు, నగేష్, సారయ్య, ప్రమోద్, నరేష్, సమ్మయ్య, రాజబాపు, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీలపల్లిలో లక్ష్మీదేవర బోనాలు

మహాముత్తారం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపల్లి గ్రామంలో సోమవారం లక్ష్మీదేవర బోనాలను గ్రామస్థులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుడి వద్ద సంప్రదాయ పద్ధతుతో లక్ష్మీదేవరకు పట్నాలు వేసి, గుడి ఆవరణలోనే మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను వండారు. పట్నాలను తొక్కిన అనంతరం బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి లక్ష్మీదేవరకు బోనాలు సమరించారు. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

మంగపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ధనసరి సీతక్క చిత్ర పటాలకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. మంగపేటలోని తెలంగాణ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురుకుంట్ల నరేందర్, బాడిశ ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం దేశానికే ఆదర్శమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాం గ్రెస్ మండల గౌరవ అధ్యక్షుడు భానుచందర్, నాయకులు ఎడ్ల నరేష్, బసరికారి నాగార్జున, బిల్లాటి నరేష్, కబ్బాక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని నిరసన

ఏటూరునాగారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా తమకు తాగునీరు అందడంలేదని మండలంలోని తాళ్లగడ్డ వాసులు ఆందోళనకు దిగారు. ఖాళీ బిందెలతో సోమవారం రహదారిపై బైఠాయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాంక్ ఏర్పాటు చేసి ఇంటింటికీ నల్లాలను బిగించారని, అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో మంచినీరు అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్హర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వాల యాదగిరిరావు తల్లి రమాదేవి మంథనిలో సోమవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. రమాదేవి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : బీఆర్ఎస్

గణపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని కేటీఆర్ సేనా సంఘం జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీ సాక్షిగా ప్రశ్నించినందుకే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేశారని విమరిశంచారు.

ఏమ్మార్పీఎస్ దీక్ష విరమణ

భూపాలపల్లి మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మహదేవపూర్ మండల కేంద్రంలో ఏడు రోజులుగా ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్షలను సోమవారం విరమించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగకు మాజీ సమితీ అధ్యక్షుడు ప్రేమాదనందం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఇందులో ముస్లిం మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఆమెన్, మాదిగ యువసేన మండల అధ్యక్షుడు మంథని రవితేజ, టౌన్ అధ్యక్షుడు చింతకుంట్ల సదానందం, సీనియర్ నాయకులు వేమునూరి జక్కయ్య, బెల్లంపల్లి మల్లేష్, చకినారపు చంద తదితరులు పాల్గొన్నారు.

బిల్ట్ కార్మికుల పోరాట కమిటీ ఎన్నిక

మంగపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురంలో ఖాయిలాపడ్డ బిల్ట్ కర్మాగారంలో గతంలో పనిచేసిన రెగ్యులర్ కార్మికుల సమావేశం సీనియర్ కార్మికుల ఆధ్వర్యంలో సోమ వారం జరిగింది. తమకు రావాల్సిన బకాయి లతోపాటు మరిన్ని హ క్కుల సాధన కోసం కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. జి.యాదగిరి, సి.హెచ్. కుమారి, పి.యా దగిరి, జి.విజయరావు, టి.వెం కటేశ్వర్‌రావు, పి.భాస్కర్‌రావు, బి.వసు రాం, బి. వెంకటనారాయణ, ఎం.వెంకటేశ్వర్లు, బి. బుచ్చిరెడ్డి, జె.రామారావు, జి.వెంకటకృష్ణ, బి.రాజేందర్, పంజాల సత్యనారాయణ, టి.దశరథం, కె. అన్నపూర్ణ, కె. మల్లికాంబ, కె.లక్ష్మి, ఎ.నర్సింహారావు, వి.రామారావు, పి. పార్వతి. ఎ.శ్రీనివాసరావు, పి.రాజిరెడ్డి, సుభాష్, యాదవరెడ్డి, కగేశ్వర్‌రావు, జి. వెంకటయ్యను ఎన్నుకున్నారు.

కుష్ఠు నివారణ పక్షోత్సవాలు షురూ

కాటారం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమ పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలన, నిర్ధారణ కోసం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ వరకు నిర్వహించనున్నారు. మొద్దుబారిన బంగారు, తెలుపు వర్ణపు మచ్చలు న్నవారిని గుర్తించి నమోదు చేస్తున్నట్లు లెప్రసీ సర్వే నోడల్ సూపర్వైజర్ రాజు వెల్లడించారు.